JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 24-11-2025
Medchal - Malkajgiri । Monday 24-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 178 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 178 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## మోదీతో ఇటాలియన్ ప్రధాని జార్జియా మెలోని భేటీ



జయభేరి, న్యూఢిల్లీ:

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ఇటాలియన్ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో సమావేశమయ్యారు. ఇరువురి భేటీలో అనేక ద్వైపాక్షిక అంశాలపై లోతైన చర్చలు జరిపారు. 2025 నవంబర్ 21 నుండి 23 వరకు దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న తొలి G20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రెండు దేశాల నాయకుల మధ్య సమావేశం జరిగింది. ...మిగతాది 2 లో

## భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్



జయభేరి, హైదరాబాద్ :

**భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని స్పష్టంగా చెప్పారు.**

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమ్మిట్ కోసం మీర్‌ఖాన్‌పేట్ లో జరుగుతున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వివిధ దేశాల నుంచి అంబాసిడర్లు, ఉన్నతస్థాయి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని, సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమ్మిట్ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. పాసులు లేకుండా, సమ్మిట్‌తో సంబంధం లేని వ్యక్తులు ఎవరూ ప్రాంగణంలోకి రావడానికి వీలులేదని స్పష్టంగా చెప్పారు. శాఖల వారిగా నిర్దేశించిన అధికారులకు ప్రవేశం ఉండాలని, పార్కింగ్‌కు, బందోబస్తులో పాల్గొనే పోలీసులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పనులను కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఉన్నారు.

## వరి పంటకే కాదు..
### మరో పంటకు కూడా రూ.500 బోనస్..?



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ చెరుకు రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ అంశానికి ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. చెరుకు రైతుల సమస్యలపై అధ్యయనం చేసి.. పరిష్కారాలు సూచించడానికి మంత్రి ఒక ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన సమీక్షలో.. హార్వెస్టర్ సబ్సిడీ పునరుద్ధరణ, డ్రిప్ ఇరిగేషన్ రాయితీ ...మిగతాది 2 లో

## శరవేగంగా పంచాయతీ ఎన్నికల దిశగా అడుగులు..
## రిజర్వేషన్ల లెక్కలు తేలేనా..?




**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా రంగం సిద్ధం చేస్తోంది. కేబినెట్ మీటింగ్ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ కాబోతోంది. రిజర్వేషన్ల వివాదాన్ని అధిగమించేలా ప్రభుత్వం ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లబోతోంది? అన్నదీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.**

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లేందుకు ఇప్పటికే గతంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో సర్కార్ నిర్ణయం తీసుకుంది. బీసీలకు లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాకపోవడంతో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. ఇక లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ ఇచ్చింది. కానీ హైకోర్టు కొట్టివేయడంతో లోకల్ బాడీ ఎన్నికలకు బ్రేక్ పడింది. నామినేషన్ల ప్రక్రియ స్టార్ట్ అయినప్పటికీ కోర్టు తీర్పుతో రాష్ట్ర ఎన్నికల సంఘం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తర్వాత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు 3 వేల కోట్లు వృధా కాకుండా పోవాలంటే లోకల్ బాడీ ఎన్నికలు ...మిగతాది 2 లో



## అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు భూసేకరణ అప్పుడే..!

- 23 మండలాల పరిధిలోని 97 గ్రామాల మీదుగా వెళ్లేలాఅమరావతి ఔటర్ రింగ్ రోడ్డును డిజైన్
- 190 కిలోమీటర్ల పొడవుతో అమరావతి రాజధాని చుట్టూ ఈ ఔటర్ రింగ్ రోడ్డు
- ప్రాజెక్ట్ వ్యయం రూ.24,791 కోట్లుగా అంచనా

జయభేరి, అమరావతి :

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి మరో అప్ డేట్ వచ్చింది. ఏపీ రాజధాని అమరావతి ని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా అమరావతి రైల్వే లైన్, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు , అమరావతి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, అమరావతి క్రికెట్ స్టేడియం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతున్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) విషయంలో కీలకమైన అడుగు పడింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ జిల్లాలలోని 23 మండలాల పరిధిలోని 97 గ్రామాల మీదుగా వెళ్లేలా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును డిజైన్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల నుంచి అధికారులు ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. ...మిగతాది 2 లో

## తెలంగాణలో 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.2500



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో హామీల అమలుపై మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన మితిమీరిన అప్పులే ప్రస్తుత ఆర్థిక ఇబ్బందులకు కారణమన్నారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం వంటి పథకాలు అమలు చేయలేకపోవడానికి కారణం గత ప్రభుత్వం చేసిన అప్పులే అని వివరించారు. వడ్డీల రూపంలోనే ప్రతి ఏడాది రూ.75,000 కోట్లు చెల్లించాల్సి వస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ.. తాము ఇచ్చిన హామీలను, ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ...మిగతాది 2 లో

## ఆధ్యాత్మిక సంకల్పమంటే..
...మిగతాది 2 లో



## 'మంకీ గో బ్యాగ్'
...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రిజర్వేషన్ల లెక్కలు తేలేనా..?

జరపాల్సిన పరిస్థితి ఉందని గత మంత్రివర్గంలో స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వం గతంలో ఇచ్చిన రిజర్వేషన్లను సరి చేయాలని డెడికేటెడ్ కమిషన్‌కు సూచించింది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన ఆ రిపోర్టుపై కేబినెట్ పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తోంది. ఇక మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాలు త్వరలోనే ఖరారు కానున్నాయి. ఈ నెల 25 వ తేదీన జరగనున్న క్యాబినెట్ మీటింగ్ నాటికి పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్‌ను ప్రభుత్వం పూర్తి చేయనుంది. ఆ తర్వాత కేబినెట్ మీటింగ్ ముగిసిన తర్వాత ఈ నెల 26 లేదా 27న గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విధంగా కసరత్తు జరుగుతోంది. డిసెంబర్ మొదటి వారం నుంచి రెండవ వారం లోపల గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కారణంగా ఊపు మీదున్న కాంగ్రెస్.. సర్పంచ్ ఎన్నికల్లో అదే జోరును కొనసాగిస్తుందా ? రిజర్వేషన్ల అంశంపై విపక్షాల నుంచి విమర్శలు, అభ్యంతరాలను ఫలితాల ద్వారా అధిగమిస్తుందా ? అన్నది ఆసక్తికరంగా మారింది.

## భూసేకరణ అప్పుడే..!

ఈ క్రమంలోనే తాజాగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 3ఏ ప్రతిపాదనలు జాతీయ రహదారుల అధికారుల వద్దకు చేరాయి. అలాగే సోమవారం కృష్ణా జిల్లా నుంచి ప్రతిపాదనలు రానున్నాయి. ఈ నేపథ్యంలో మరికొన్ని దశలు పూర్తి అయితే.. భూసేకరణ మొదలుపెట్టాలని అధికారులు భావిస్తున్నారు.మరోవైపు 190 కిలోమీటర్ల పొడవుతో అమరావతి రాజధాని చుట్టూ ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రణాళికలు రచించారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు డీపీఆర్ సైతం ఇప్పటికే ఢిల్లీలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) వద్దకు చేరింది. 97 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్లనుంది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి మైలవరం, కంచికచర్ల,, జి.కొండూరు, వీరులపాడు మండలాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్తోంది. ఈ మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుంది. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ నిర్మాణంపై ఇప్పటికే ఆరు గ్రామాల ప్రతిపాదనలు అధికారులకు చేరాయి. అయితే ప్రతిపాదనల్లో కొన్ని లోపాలు ఉన్నాయనే కారణంతో NH అధికారులు వెనక్కి పంపారు. దీంతో రెవెన్యూ అధికారులు వాటిని సరిచేసి, మరికొన్ని గ్రామాల ప్రతిపాదనలను చేర్చి 3ఏ ప్రతిపాదనలు NH అధికారులకు పంపించారు. భూమి వివరాలు, సర్వే నంబరులో ఎంత ఉంది.. రహదారి నిర్మాణం కోసం ఎంత భూమిని తీసుకుంటున్నారనే వివరాలు అందులో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలను జాతీయ రహదారుల సంస్థ అధికారులు పోర్టల్‌లో నమోదు చేస్తారు. అనంతరం దిల్లీలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కార్యాలయానికి.. రోడ్లు, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ అధికారులకు పంపిస్తారు. మరోవైపు అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఐదు జిల్లాల పరిధిలో నిర్మిస్తున్నారు. ఏలూరు, పల్నాడు, గుంటూరు, కృష్ణా, పల్నాడు జిల్లాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్తోంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు ఇప్పటికే ఢిల్లీలో ఆమోదం లభించింది. గుంటూరు, పల్నాడు ప్రతిపాదనలు ఢిల్లీ కార్యాలయానికి చేరాయి. మరో వారం పది రోజుల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామాల ప్రతిపాదనలు కూడా ఢిల్లీకి పంపిస్తారు.అక్కడి నుంచి ఆమోదం రాగానే... అభ్యంతరాల స్వీకరణ చేపడతారు. ఆ తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ చేపడతారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును 190 కిలోమీటర్ల పొడవుతో ఆరు వరుసలుగా నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రాజెక్ట్ వ్యయం రూ.24,791 కోట్లుగా అంచనా వేశారు.

## మహిళలకు నెలకు రూ.2500

తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన మితిమీరిన అప్పులే కారణమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం నాడు పెద్దకొత్తపల్లిలో జరిగిన ఇందిరా మహిళా శక్తి చీరలు, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్నికల హామీల అమలుపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు బదులిచ్చారు.మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన తులం బంగారం, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం వంటి పథకాలు ఏమయ్యాయని కొందరు మాట్లాడుతున్నారని అన్నారు. 'ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు కేవలం లక్ష రూపాయలు ఇస్తున్నందుకే సంవత్సరానికి రూ.4,000 కోట్ల ఖర్చు అవుతోంది' అని ఆయన వివరించారు. ఒకవేళ తులం బంగారం పథకాన్ని కూడా అమలు చేస్తే.. దానికి అదనంగా దాదాపు మరో రూ.4,000 కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. అలాగే.. తెలంగాణలో 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అమలు చేయాలంటే సంవత్సరానికి దాదాపు రూ.10,000 కోట్ల ఖర్చు అవుతుంది. ఈ రెండు పథకాలకు కలిపి సుమారుగా రూ.15,000 కోట్ల అదనపు ఖర్చు అవుతుందని మంత్రి లెక్కలు చెప్పారు. ఈ భారీ ఖర్చులను భరించడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అనుకూలంగా లేకపోవడానికి గల కారణాన్ని ఆయన స్పష్టం చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పుడు మేము అప్పు చేసి వడ్డీ కడుతున్నాం. గత ప్రభుత్వం తెచ్చిన అప్పుల వడ్డీలకే ప్రతి ఏడాది రూ.75,000 కోట్లు చెల్లించాల్సి వస్తోంది' అని జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇంతలా అప్పులు చేసి ఉండకపోతే.. ఆ వడ్డీలను కట్టాల్సిన అవసరం ఉండేది కాదు, తద్వారా తాము ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే అవకాశం ఉండేది కదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలతో పాటు, ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తోందని జూపల్లి స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్యమంత్రులందరూ చేసిన అప్పుల కంటే పది రెట్లు అధికంగా కేసీఆర్ అప్పులు చేశారని ఆరోపించారు. మంత్రి తన నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేసుకుంటూ.. గతంలో కొల్లాపూర్‌లో సరైన రోడ్లు కూడా లేవని చంద్రబాబు వంటి వారు హేళన చేశారని.. కానీ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని అభ్యర్థించి అభివృద్ధి పనులు చేయించానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలు కూడా నాణ్యతతో రాజీ పడకుండా తయారు చేయించామన్నారు. ప్రతీ ఒక్కరికీ ఈ చీరలు అందుతాయన్నారు.

## వరి పంటకే కాదు..

వంటి డిమాండ్లను రైతులు మంత్రి ముందు ఉంచారు. రైతులకు అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించిన ప్రభుత్వం.. వారికి రూ.500 చొప్పున బోనస్ అందించే అంశాన్ని పరిశీలిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ అంశాన్ని సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే.. ఈ హామీ అమలులో జాప్యం జరుగుతుండటంతో.. రైతులు తమ సమస్యను నేరుగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు.. ప్రతి క్వింటాలు సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌ను చెరుకు పంటకు కూడా వర్తింపచేయాలని రైతులు కోరుతున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. చెరుకు రైతులు, చక్కెర పరిశ్రమల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి శాశ్వత పరిష్కారాలు సూచించేందుకు మంత్రి శ్రీధర్ బాబు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం నాడు సచివాలయంలో చెరుకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ కమిటీ పనిచేయనుంది. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో చెరుకు రైతులకు అందుతున్న ప్రయోజనాలు, రాయితీలు, చెరుకు హార్వెస్టర్ యంత్రాలపై సబ్సిడీ వంటి అంశాలపై అధ్యయనం చేసి, సాధ్యమైనంత త్వరలో నివేదిక అందిస్తుందని మంత్రి వెల్లడించారు. సమావేశంలో రైతులు ప్రస్తావించిన ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.. సన్న ధాన్యానికి ఇస్తున్నట్లుగా, చెరుకు పంటకు కూడా టన్నుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్. కేన్ కమిషనరేట్ వర్గాల సమాచారం ప్రకారం.. టన్నుకు రూ.225 చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలుస్తోంది. హార్వెస్టర్ల సబ్సిడీ విషయంలో.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 50 శాతం సబ్సిడీని మళ్లీ ఇవ్వాలి. చెరుకు పంటకు డ్రిప్ ఇరిగేషన్ రాయితీని కొనసాగించాలని రైతులు కోరారు. డ్రిప్ పరికరాల వల్ల ప్రతి ఎకరానికి 89 టన్నుల దిగుబడి పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. చెరుకు రవాణా ఛార్జీలను కొంత మేరకు భరించే అంశాన్ని కూడా కమిటీ అధ్యయనం చేస్తుంది. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...రాష్ట్రంలోని ప్రైవేటు రంగ చక్కెర పరిశ్రమలను కాపాడుకుంటామని, అలాగే నిజాం షుగర్స్ పునరుద్ధరణకు వారి అనుభవాన్ని వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికులు, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# సిద్ధాపూర్‌లో

# 'మంకీ గో బ్యాగ్'



ఒకప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆ ఊరే పేరు చెబితేనే అందరికీ హడల్. అతి సమస్మాత్మక, సున్నితమైన ఊరు కూడా. నిత్యం వార్తలో నిలిచే గ్రామం. ఆ ఊరి పేరు చెప్పగానే చుట్టుపక్కల జనాల్లో ఒకింత భయం.. సీన్ కట్ చేస్తే ఆ ఊరి ప్రజలు పచ్చని పొలాల్లో వ్యవసాయం చేస్తూ తమ పనులు తాము చక్కదిద్దుకుంటారు. అయితే ఒకప్పుడు సై అంటే సై అంటే జనాన్ని కోతులు వణికించడం ఆసక్తిగా మారింది. వానరాలు పేరు చెబితేనే ఆ ఊరు జనం హడలెత్తిపోతున్నారు. ఇంటి ముందట కర్ర పట్టుకొని బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏదైనా పని మీద వెళ్తే కర్ర లేనిదే బయటకు అడుగు పెట్టరంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ ఊరి పేరు సిద్ధాపూర్. కోతుల బెడద కారణంగా ఆ గ్రామంలో మంకీ గో బ్యాక్ అంటూ తమ బాధను వెళ్లగక్కుతున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదు.

.....బాలు జాజాల

జయభేరి, అచ్చంపేట :

**కనబడితే చాలు..**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉంది సిద్ధాపూర్ గ్రామం. మొత్తం పది వార్డులు. దాదాపు 5 వేల జనాభా. వ్యవసాయంపై ఆధారపడే గ్రామం. పొలం తప్ప ఇతర వ్యాపకాలు తెలియని గ్రామం. అందుకే పొద్దుగాల ఆ ఊర్లో అడుగుపెడితే చాలు.. చేతిలో కర్ర, పలుగు, పార పట్టుకొని, జీవాలతో పొలాల బాట పట్టడం కనిపిస్తోంది. అయితే ఆ గ్రామం నల్లమల అడవి మధ్యలో ఉండటం.. ఎటుచూసిన కొండలు, గుట్టలు ఉండటం కోతులకు నిలయంగా మారింది. గత నాలుగేళ్ల నుంచి సిద్ధాపూర్ లో వానర సైన్యం భీభత్సం చేస్తోంది. పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరూ కనబడినా వెంటపడి తరముతున్నాయి. చేతిలో తినే పదార్థం కనిపిస్తే చాలు.. ఇక అంతే సంగతులు అన్నట్టు వెంటబడి మరి తరుముతాయి. చేతిలోని వస్తువులు లాక్కుంటాయి.

**ఇంటికో కర్ర**

సిద్ధాపూర్ ఎక్కడ చూసినా కోతులు స్వైర విహారం చేస్తుండటంతో ఆ గ్రామస్తులు తమ ఇంటి ముందు కర్ర పెట్టుకొని ఉండటం గమనిస్తారు. ఏమాత్రం కర్ర లేకున్నా.. ఏమాత్రం ఆదమరిచినా.. ఇంట్లోకి ప్రవేశించి రణరంగం చేస్తాయి. దొరికిందల్లా ఎత్తుకుపోతాయి. ఏమాత్రం వారించినా గుర్రున కరవడానికి ముందుకొస్తాయి. అందుకే ఆ ఇంటి ముందు ప్రతిఒక్కరూ కర్రను పెట్టుకొని బతుకు జీవుడా అంటూ జీవితాలు వెళ్లదీస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందర్నీ భయపెటేస్తున్నాయి. అందుకే కర్రతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు ఆ ఊరి గ్రామస్తులు.

**ఫలించని ప్రయత్నాలు**

ఒకవైపు ఇండ్లు.. మరోవైపు పంటపొలాల్లో భీభ్సతం





చేస్తున్న కోతుల గుంపుకు చెక్ పెట్టేందుకు ఊరి యువత ముందుకొచ్చారు. కొన్ని కుటుంబాలకు రూ.500 లు చందా వేసుకొని కోతులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినా రెండు మూడు రోజుల తర్వాత మళ్లీ కోతుల గుంపు ప్రవేశించి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చేతికొచ్చిన పంటలను ధ్వసం చేస్తుండటంతో ఆ ఊరి గ్రామస్తులు పంట పొలాల దగ్గరే కాపాలకాయాల్సి వస్తోంది. ఈ సమస్యకు ఎప్పుడు ముగింపు పలుకుతుందోనని గ్రామస్తులు బిక్కు బిక్కు మంటూ బతుకుతున్నారు.

## మోదీతో ఇటాలియన్ ప్రధాని

ఈ సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొన్నారు. ద్వైపాక్షిక సమావేశానికి ముందు, ప్రధాని మోదీ, జార్జియా మెలోని కరచాలనం చేసుకున్నారు. తరువాత అనేక ద్వైపాక్షిక అంశాలపై లోతైన చర్చలు జరిపారు. అయితే, జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన G20 శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, జార్జియా మెలోని మధ్య ఇది రెండవ సమావేశం. ఈ ద్వైపాక్షిక సమావేశానికి ముందు, శనివారం G20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇటాలియన్ ప్రధాని జార్జియా మెలోనితో భేటీ అయ్యారు. ఇద్దరు నాయకుల సమావేశానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అయింది. ఇందులో ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ఇటాలియన్ ప్రధానమంత్రి జార్జియా మెలోని విస్తృతంగా నవ్వుతూ కనిపించారు. G20 శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావడానికి ప్రధాన మంత్రి మోదీ శుక్రవారం (నవంబర్ 21) జోహన్నెస్‌బర్గ్ చేరుకున్నారు, అక్కడ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ఆయనకు చేతులు జోడించి నమస్తే అంటూ స్వాగతం పలికారు. ఆ తర్వాత ప్రధాని మోదీ కూడా అదే విధంగా ఆయన శుభాకాంక్షలు స్వీకరించారు. ఇదిలావుంటే, ఆదివారం (నవంబర్ 23) జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన G20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమైకా, నెదర్లాండ్స్‌కు చెందిన అధినేతలతో సహా అనేక ఇతర ప్రపంచ నాయకులతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ప్రధానమంత్రి మోదీ తన సమావేశాల వివరాలను సోషల్ మీడియాలో అనేక పోస్ట్‌లలో పంచుకున్నారు. "భారతదేశం జమైకా చారిత్రక, సాంస్కృతిక సంబంధాలతో కూడిన గొప్ప స్నేహంతో ముడిపడి ఉన్నాయి. సమిష్టి పురోగతికి లోతైన నిబద్ధతతో మా భాగస్వామ్యం పెరుగుతూనే ఉంటుంది" అని జమైకా ప్రధాన మంత్రి ఆండ్రూ హోల్నెస్‌తో చర్చల తర్వాత ప్రధాని మోదీ అన్నారు. ఇదిలావుంటే, డచ్ ప్రధాన మంత్రి డిక్ స్కూఫ్ తో చర్చల సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ మాట్లాడుతూ, "రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాలు జల వనరులు, ఆవిష్కరణలు, సాంకేతికత, శక్తి వంటి రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. భవిష్యత్తులో వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి మేము కృషి చేస్తూనే ఉంటాము" అని అన్నారు.

# ఆధ్యాత్మిక సంకల్పమంటే...

### పట్టుదల.. ఓ గట్టి నిర్ణయం.. మొక్కవోని దీక్ష.. సంకల్పమంటే... మనసులో కలిగే ఓ ఆలోచన.. ఓ భావన...

**ఆ సంకల్పానికి ఆధ్యాత్మిక శక్తి తోడైతే...**

అద్భుతాలు సృష్టించవచ్చు. మనిషి మహనీయుడుగా మారతాడు. అసాధ్యం అనేదే ఉండదు. మనస్సులో కలిగే ఆలోచన మనకు ఆనందాన్ని లేదా లాభాన్ని కలిగించేదైనా అవుతుంది. కాదంటే... బాధను, నష్టాన్ని కలిగించేదైనా అవుతుంది. ఈ రెండూ కాని ఆలోచన ఏదీ ఉండదు. ఏ ఆలోచనైతే మనకు ఆనందాన్ని కలిగిస్తుందో ఆ ఆలోచనని సొంతం చేసుకోవాలని, ఆ ఫలితాన్ని త్వరగా అందుకోవాలని, అందుకోసం ఏదైనా సరే చెయ్యాలని మనసు కోరుకుంటుంది. భౌతికంగా మన ప్రయత్నమూ ఆ దిశగానే సాగుతుంది. ఇలా మనలో పట్టుదలని కలిగించే ఆ ఆలోచనే సంకల్పం అవుతుంది. అలాంటి సంకల్పానికి ఆధ్యాత్మికత మరింత చైతన్యాన్ని జోడిస్తుంది. మనం అనుకున్న ప్రతి మాట, చేసిన ప్రతి ఆలోచన సంకల్పం కాదు. ఆలోచన వేరు. సంకల్పం వేరు. మనసులో కలిగే ఓ చిన్నపాటి భావన ఆలోచన అవుతుంది. నిరంతరంగా ఆలోచించటం మనస్సుకు సహజ లక్షణం. ఒక్క క్షణంలో వందలాది ఆలోచనలు మన మనసులో పుడతాయి. ఈ ఆలోచనలన్నీ సంకల్పాలు కావు. మనకు కలిగే ఆలోచనలన్నీ దాదాపు క్షణికాలే. వేలాది ఆలోచనల్లో ఏవో కొన్ని ఆలోచనలు మాత్రమే ఆచరణలోకి వస్తాయి. ఏ ఆలోచనైతే మళ్ళీ మళ్ళీ మన మనస్సులో మెదులుతుంటుందో, ఏ ఆలోచన గురించి మనస్సు, బుద్ధి తీవ్రంగా పరితపిస్తూ ఉంటాయో, ఏ ఆలోచన కోసం సాధించటం కోసం మన హృదయం అనుక్షణం పరితపిస్తుంటుందో ఆ ఆలోచనే 'సంకల్పం' అవుతుంది.

**ఆది, అనాది.. సంకల్పమే**

మహాప్రళయం తర్వాత సృష్టిని తిరిగి ప్రారంభించాలని బ్రహ్మదేవుడు అనుకున్నాడు. ఆ సమయానికి ఆయన చేతిలో ఏవిధమైన పరికరం లేదు. ఉన్నదంతా మనసు నిండా ఆలోచన మాత్రమే. ఎలాగైనా సరే సృష్టి జరగాలని భావించాడు. ఆ ఆలోచన బలపడింది. సంకల్పంగా మారింది. 'తప', 'తప' అనే శబ్దం ఆకాశవాణి నుంచి వినిపించింది. తపస్సు ప్రారంభించాడు. విరాట్పుషురుడికి అనుగ్రహం లభించింది. బ్రహ్మముఖం నుంచి రుద్రుడు ఆవిర్భవించాడు. అక్కడ నుంచి మిగిలిన సృష్టి అంతా ఆవిర్భవించింది. బ్రహ్మ సంకల్పానికి సైతం ఆధ్యాత్మిక శక్తి అవసరమైంది. తపస్సు, సాధన ద్వారానే ఇది సాధ్యపడింది.

జయభేరి ఆధ్యాత్మిక శీర్షిక

**సంకల్పం... సాధన**


మహారాజు విశ్వామిత్రుడు చాలా గర్విష్టి. బ్రహ్మర్షి అయిన వశిష్ఠుడిని అనేకరకాలుగా ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తాడు. కానీ ఏ ఒక్క ప్రయత్నమూ ఫలించదు. వశిష్ఠుడికి ఉన్న బ్రహ్మర్షిత్వం తనకూ కావాలనుకున్నాడు. తపస్సు ప్రారంభించాడు. కొద్దికాలానికే మేనక మోహంలో పడి తపస్సు విడిచిపెట్టాడు. అప్పటిదాకా పొందిన శక్తి వ్యర్థమైపోయింది. తప్పు తెలుసుకున్నాడు. ఈ సారి గట్టిగా సంకల్పించుకున్నాడు. తపస్సు ప్రారంభించాడు. దైవమూ అనుగ్రహించింది. అమోఘమైన తన ఆధ్యాత్మిక సంకల్పశక్తితో విజయం సాధించాడు. వశిష్ఠుడి చేత 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకున్నాడు. సంకల్ప సాధన అంటే ఇలా ఉండాలి.

**సంకల్పానికి ధ్రువస్థానం**

సవతి తల్లి సురుచి పలికిన నిష్టూరాలకు ధ్రువుడు ఎంతగానో కుమిలిపోయాడు. కన్నతండ్రిని కనీసంగా కూడా చేరలేని తన స్థితికి దుఃఖించాడు. ఎలాగైనా సరే తండ్రి ఉత్తానపాదుడి ప్రేమను పొందాలని సంకల్పించాడు. తల్లి సునీతి సూచనతో తపస్సు కోసం అడవులకు చేరుకున్నాడు. నారద మహర్షి చేసిన మంత్రోపదేశంతో శ్రీమన్నారాయణుడి ప్రత్యక్ష దర్శనంతో పాటు శాశ్వతమైన ధ్రువస్థానాన్నిపొందాడు. ఆధ్యాత్మిక శక్తి తోడైన సంకల్పం సాధించిన సర్వోన్నత విజయానికి ఇది సంకేతం.

**సంకల్పశక్తి**

ప్రతి మనిషిలో ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అనే మూడుశక్తులు సహజంగా ఉంటాయి. ఇవి పుట్టుకతోనే వస్తాయి. అయితే, ఈ శక్తులు తనలో ఉన్నాయన్న ఎరుక కొద్దిమందికి మాత్రమే ఉంటుంది. ఈ మూడుశక్తుల్లో మొదటిదైన ఇచ్ఛాశక్తే సంకల్ప శక్తి. మనలో ఉండే అతి గొప్పశక్తి ఇచ్ఛాశక్తి. ఇది దైవీకమైంది. మన ద్వారా జరిగే ప్రతి పనికీ మనలో కలిగే సంకల్పమే కారణమవుతుంది. జ్ఞానం ఎంత ఉన్నప్పటికీ మహత్ సంకల్పం మనలో పుట్టాలంటే జ్ఞానం మాత్రమే సరిపోదు. దైవిక సహాయం లేదా ప్రకృతి సంకల్పం ఇందుకు తోడుకావాలి. సంకల్పానికి, మామూలు ఇచ్ఛాశక్తికి కొద్దిపాటు తేడా ఉంటుంది. ఈ సూక్ష్మభేదాన్ని మనం గ్రహించాల్సి ఉంటుంది. సంకల్పం అంటే దృఢ నిశ్చయం. ఏదైనా ఒక పని జరిగితీరాల్సిందే అని మనం అనుకుంటే అది కేవలం 'ఇచ్ఛ' (కోరిక)గానే మిగిలిపోతుంది. ఈ ఇచ్ఛ వెనక దృఢమైన నిశ్చయం ఉంటే అది సంకల్పంగా మారుతుంది. సంకల్పాల ద్వారా మనం శక్తిని పొందటం లేదా పోగొట్టుకోవటం జరుగుతుంది. పవిత్రమైన సంకల్పాలతో శక్తి ఉత్పన్నమవుతుంది. అపవిత్రమైన సంకల్పాలతో శక్తి నాశనమవుతుంది. మన ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని వ్యక్తపరిచేవే పవిత్ర ఆలోచనలు. మిగతావన్నీ అపవిత్ర ఆలోచనలు. శంబల శక్తి ద్వారా ఆధ్యాత్మిక సంకల్పం పెరుగుతుంది.



Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

# ఆలయంలో భక్తుల కోలాహలం

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23:

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం భక్తుల కోలాహలంతో నిండిపోయింది. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనార్థం యాదగిరిగుట్టకు వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులతో యాదగిరి కొండతో పాటు పరిసర ప్రాంతాలు నిండిపోయాయి. స్వామివారి దర్శనం క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు,గదుల విచారణ కార్యాలయం, కల్యాణకట్ట,పుష్కరిణి, అన్నదాన సత్రం ప్రాంతాల్లో ఎటుచూసినా భక్తుల రద్దీ ఉండడంతో సందడిగా మారాయి. స్వామి, అమ్మవార్ల సర్వ దర్శనానికి 5 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్యకల్యాణం నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కోలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## శ్రీ నారసింహుడి నిత్యరాబడి...

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.50,49,359 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,59,000, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,07,400, వీఐపీ దర్శనం ద్వారా రూ.8,10,000, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.4,17,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,50,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,42,548, ప్రసాద విక్రయం ద్వారా రూ.1.8,00,035, కల్యాణకట్ట ద్వారా రూ.1,24,500తో పాటు వివిధ శాఖ,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.




# బీసీ శాంతియుత ర్యాలీని విజయవంతం చేయండి

జయభేరి, కొండమల్లేపల్లి :

కొండమల్లేపల్లి పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించేటటువంటి శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కుమ్మర శాలివాహన సంఘం మండల కన్వీనర్,బీసీ సంఘం నాయకులు ఏరుకొండ రాము అన్నారు. ఆయన ఈ సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వాలు అధికారికంగా బీసీ రిజర్వేషన్ 42% పూర్తికాకముందే ప్రస్తుతం స్థానిక ఎన్నికలకు పోవడం బాధాకరమన్నారు. నోటిఫికేషన్ రద్దుచేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అధికారికంగా అమలు చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లిలో సోమవారం శాంతియుతంగా నిరసన ర్యాలీని చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీలో బీసీ సంఘం నాయకులు ప్రతినిధులు పార్టీలకు అతీతంగా నిరసన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరాడు. ఈ ర్యాలీకి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు కూడా మద్దతు తెలపాల్సిందిగా కోరారు. ర్యాలీకి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.ప్రభుత్వాలు ఇదే ధోరణితో పోతూ బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే బీసీ ఓటు బ్యాంకు గా మారి తమ బీసీ ప్రతినిధులను గెలిపించుకోవాలని ఆయన సూచించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో కూడా విడుదల చేసింది. అయితే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కోర్టులో కేసు వేసి రాకుండా చేసిన విషయం తెలిసిందే.ఇదే అదునుగా బీసీలు అంతా ఏకమై చట్టసభలలో 42 శాతం రిజర్వేషన్ను సాధించే వరకు కలిసికట్టుగా పోరాడాలని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నాను: కడియం శ్రీహరి



జయభేరి, వరంగల్, నవంబర్ 23:

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ నెల 23వ తేదీలోపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సభాపతి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, తనకు నోటీసులు అందాయని తెలిపారు. అయితే, వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని సభాపతిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు.సభాపతి ఇచ్చిన గడువులోగా వివరణ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. సభాపతి తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార పార్టీతో కలిసి పనిచేస్తున్నందునే స్టేషన్ ఘనపూర్‌కు పెద్ద ఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన వెల్లడించారు. తాను ఎవరికీ భయపడని వ్యక్తినని అన్నారు. ఒకవేళ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వస్తే తాను తిరిగి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తారనే నమ్మకం తనకు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# మహిళలకు పెద్దపీట కాంగ్రెస్ ప్రభుత్వం

జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 23:



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 2 00 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇచ్చి ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, మహిళల పేరు మీద ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం మహిళల పేరు మీదనే అందిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం లో అర్హులందరికీ రేషన్ కార్డులు, రేషన్ కార్డులో పిల్లల పేర్ల నమోదు, ప్రభుత్వం ప్రజలందరికీ సన్నబియ్యం అందజేస్తుందని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఆడపడుచులుగా భావించి నీలిరంగు చీరలను ఆకాశమంత మనసుతో ఆకాశమంత ఎత్తుకు ఎదగాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల సభ్యులను సిరిసిల్లకు పంపించి నచ్చిన డిజైన్లతో చీరలను తయారు చేపించి పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం మహిళలకు ప్రత్యేకమైన పథకాలను పంపిణీ చేస్తుందని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పిటిసిలు లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి పనులు కావాలన్నా గ్రామ ప్రతినిధులు గెలిపిస్తే వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చి అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు. నియోజకవర్గంలోని పిల్లలందరికీ, మహిళా సంఘాల సభ్యులకు, రేషన్ కార్డు కలిగిన మహిళలకు, రేషన్ కార్డు లేని మహిళలకు కూడా చీరలను మహిళా సంఘాల ద్వారా పంపిణీ చేస్తారని, నియోజకవర్గంలోని అందరి మహిళలకు చీరలను పంపిణీ చేస్తారని అధైర్య పడవద్దని, ప్రతి ఒక్కరికి చీరలను అందించే బాధ్యత తనదేనని అన్నారు .ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నాగిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జానయ్య, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి ,ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, తాసిల్దార్ జలజా కుమారి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏటీఎం రమణ, సీసీలు ఉపేందర్, రమ, రాజేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పలుగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎలగల రాజయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డొంకని వెంకటేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు భూక్య రాజారాం నాయక్, పనిగట్ల సుదర్శన్, బొత్త రాములు, రామగొని వెంకటేష్ గౌడ్, వల్లపు రమేష్, శ్రీరామ్మూర్తి, మహిళా శాఖ మండల అధ్యక్షురాలు మమత, మాజీ సర్పంచ్ సోమల వెంకటేష్, అడ్వకేట్ పడాల శ్రీనివాస్, మహిళా సమైక్య కార్యదర్శి, కోశాధికారి, వివోఏ లు, మహిళా సంఘం సభ్యులు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం

- పరకాల మహిళా డైరీ మహిళల భవిష్యత్ నిర్మాణానికి పునాదిగా నిలవాలి
- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

జయభేరి, పరకాల, నవంబర్ 23:



ఆదివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల, నడికుడ, ఆత్మకూర్ మరియు దామెర మండలాల పరిధిలోని మహిళలకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది అని, ఆడబిడ్డలకు సారె పంపిణీ చేసి మన ముఖ్యమంత్రి రేవంతన్న మహిళలను గౌరవిస్తున్నారని అన్నారు. మహిళా సాధికారికత నిర్ణయం తీసుకునే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని, మహిళలను గౌరవించుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ, మహిళా శక్తిని గౌరవించబడడమే ప్రధానమన్నారు. ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు కల్పించిదన్నారు. పొదుపు ఆలోచన ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులను మార్పు తీసుకువచ్చే వ్యవస్థ మహిళా సంఘాల గ్రూపు వల్ల కలిగిందన్నారు. ఎవరి సహాయం లేకుండా మహిళలు వారికి వారే ఎదగాలనే ఉద్దేశం మహిళా గ్రూపులకు ఏర్పాటు అని, ఇబ్బందులు వచ్చిన మీరు మీరే అభివృద్ధి చెందాలన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచుకొని రాష్ట్ర, దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కల్పించే మహిళా గ్రూపుల శక్తి అదే మహి శక్తి అన్నారు. మండల సమాఖ్య నాయకత్వంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల ఆర్థికంగా బలపడతాడని తెలిపారు. రేవంత్ అన్న నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, 2047 విజన్ మహిళా సాధికారికత సాధన అన్నారు. ప్రతి కుటుంబం అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళా శక్తి ఉప్పెనలా ముందుకు సాగాలి అని, ఎన్ని అడ్డంకులు వచ్చిన లక్ష్యం వైపు అడుగులు వేయాలి అన్నారు. పరకాల మహిళా డైరీ ఏర్పాటు మహిళలపై పూర్తి నమ్మకంతో ఏర్పాటు చేస్తున్నామని ఇది అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు.

# బిఆర్ఎస్ లోకి భారీగా చేరికలు

- కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే చల్లా

జయభేరి, పరకాల, నవంబర్ 23:



హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఆ పార్టీలకు రాజీనామా చేస్తూ పరకాల మాజీ శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు. వారికి గులాబీ కండువాకప్పి మాజీ ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. భారాసలో చేరిన వారిలో టీడీపీ మండల అధ్యక్షులు గోనె మధుకర్, కాంగ్రెస్ నాయకులు కో ఆప్షన్ సభ్యులు అన్నం రాజు, నాయకులు అన్నం మొగిలి, నామాని యాదగిరి, మారేడుగొండ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ సర్పంచ్ సావు రాజేశ్వర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు రాయరాకుల రవీందర్, కార్యదర్శి మోతే రమేష్, మాజీ సొసైటీ చైర్మన్ నాగనబోయిన సాంబయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ లకిడే శివరామ్, యూత్ నాయకులు వేల్పుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప ఆశీస్సులు అందరి మీద వుండాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# UGD పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే



జయభేరి, కాప్రా :

కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి గూడ తాళ్ళ బాయి వద్ద 9 లక్ష రూపాయల నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్ఎన్ఎస్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23:

యాదగిరిగుట్ట కొండపైకి వెళ్లే ఎస్ఎల్ఎన్ఎస్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆదివారం ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్ గౌడ్,ఆటో యూనియన్ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. కొత్త అధ్యక్షుడిగా రాంపల్లి రజినీకాంత్ గౌడ్, గౌరవ సలహాదారుడిగా గుండు సంతోష్ గౌడ్,ఉపాధ్యక్షుడిగా కానుగు ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా అనంతుల మల్లేష్ గౌడ్, క్యాషియర్ గుండు నర్సింహ్మా, కార్యదర్శిగా గడ్డం ఎల్లగౌడ్, ఆర్గనైజర్ గా నాలపట్ల రజీని కాంత్ గౌడ్,గోర్ల నరేష్, కొలనుపాక నరసింహ,గౌరవ సలహాదారులుగా ముఖ్యర్ల భిక్షపతి యాదవ్,కందుకూరు మధు,రాగీర్ వంశీ,మధు, కానుగు సత్యనారాయణ, కొక్కొండ జహంగీర్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు చీరల పంపిణీ



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23:

గత ప్రభుత్వం రూ.60 చీరలు ఇచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని, అందుకే ప్రజా ప్రభుత్వంలో మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా చీరలను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమాభివృద్ధిని కొనసాగిస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఓట్ల కోసం వనిచేస్తే ప్రజా ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని మహిళలంతా మహిళా సంఘంలో సభ్యులుగా లేని వారు వెంటనే చేరాలని, తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ నేతలు చీర శ్రీశైలం, ఎడ్ల రామిరెడ్డి, గుండ్లపల్లి భరత్ గౌడ్, జిన్నా హరినాథ్ రెడ్డి, బింగిలక్ష్మి పతి, సిరికొండ నర్సింహులు, పన్నీరు భరత్, డిఆర్డిఏ నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ముగిసిన సహకార భారతి అభ్యాస వర్గ

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23:

సహకార భారతి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో రెండు రోజులుగా జరిగిన సహకార భారతి కార్యకర్తల అభ్యాస వర్గ ముగిసింది. ఆదివారం ముగింపు కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎక్కటి ఉపేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దీపక్ చౌరాసియా, అఖిల భారత సంపర్క్ ప్రముఖ్ అడ్డూరి శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యకారిణి సదస్సులు అన్నదానం సుబ్రహ్మణ్యం పాల్గొని మార్గ నిర్దేశం చేశారు. సహకార రంగానికి సంబంధించిన మూలచింతన, సహకార చట్టాలు,సహకార సంఘాల నిర్మాణం, అడ్మినిస్ట్రేషన్,సహకార సంఘాల సమస్యలు, పరిష్కారాలు,సహకార సంఘాల అభివృద్ధి గురించి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి 150 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు న్యాలమడుగు శంకరయ్య, నరళదేవి, విఠలయ్య, పొన్నాల యాదగిరి, పాండు రంగారెడ్డి, సుమంత్, కోదండరాం, బాలరాజు, రమాదేవి, దీప మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 23 :

తుర్కపల్లి మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని కేంద్రంలో ఇంకా ఎంత ధాన్యం ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తరచూ తేమశాతం పరిశీలించి దాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందా అని అడిగి తెలుసుకున్నారు, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సరిపడ లారీలు వస్తున్నాయా లేదా అని అడిగారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించారని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జానయ్య, తహసిల్దార్ జలజ కుమారి, ఏటీఎం రమణ, సీనియర్ అసిస్టెంట్ సలీం, ఆర్ ఐ రఘు రామారావు, సీసీ రమ, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా 78వ ఎన్సిసి దినోత్సవ వేడుకలు



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 23 :

తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఎన్సిసి 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సిసి యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మోడల్ స్కూల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎన్సిసి అసోసియేట్ ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ ఎన్సిసి వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ ,దేశభక్తి, ఐక్యమత్యం, లౌకిక దృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. దేశ నిర్మాణంలో ఎన్సిసి క్యాడర్ పాత్ర ఎంతో విలువైందని, అత్యవసర సమయాల్లో సామాజిక సేవ కార్యక్రమాల్లో ఎన్సిసి క్యాడర్ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, దివ్య, యశ్వంత్, బాలాజీ, రాహుల్, శేషాద్రి, విజయ్, ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన బిజెపి నాయకులు



జయభేరి, పరకాల, నవంబర్ 23:

పరకాల నియోజకవర్గంలోని బిజెపి దామెర మండల నాయకులు దామేరుప్పుల నాగరాజు కుమార్తె ధనుశ్రీ నూతన ఫల పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన పరకాల బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరంగి సంతోష్ కుమార్, కాచం గురుప్రసాద్ , పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దేవనూరు మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పి జయంతి లాల్, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, గీసుకొండ మండల అధ్యక్షులు కొంగర రవికుమార్, ప్రోరెడ్డి ప్రదీప్ రెడ్డి, మండల నాయకులు పెంట రమేష్, దామెరుపుల బిక్షపతి, రంజిత్, దేవేందర్ శక్తి కేంద్ర ఇన్చార్జ్ ఎక్కలదేవి రమేష్, కన్నె కొమురయ్య, బూత్ అధ్యక్షులు వేల్పుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఐసి వ్యాపార పోటీలలో దేవరకొండ బ్రాంచ్ ముందంజ

- దేవరకొండ ఎల్ఐసి కుటుంబ సభ్యులకు ఈ అవార్డు అంకితం
- ఎల్ ఐసి జోనల్ వ్యాపార పోటీలో విజయం సాధించిన దేవరకొండ ఎల్ ఐ సి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహన్
- మనాలిలో రాము చౌహన్ ను సత్కరించిన జోనల్ మేనేజర్




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటూ దినదినాభివృద్ధిగా అంచలంచలుగా ఎదుగుతూ భారతదేశంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచ్ లకు దీటుగా వ్యాపారంలోనూ విధి నిర్వహణలోనూ తను అనుకున్నదే పరిపాటిగా చేసే పని దైవంగా భావించడంతో ఏ పని చేసిన విజయమే తప్ప, పనిచేసే బ్రాంచీని పదులపరుస్తూ సహ ఉద్యోగులే కుటుంబ సభ్యులుగా వారితో కలిసి మెలిసి ఎల్ఐసి వ్యాపార రంగంలో ఒక దిగ్గజ వ్యాపారవేత్తగా ఎంతో మందికి ఆదర్శంగా నిదర్శనంగా అందరి మన్ననలు చూరగొంటున్న మన గిరిజన ప్రాంత ముద్దుబిడ్డ దేవరకొండ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాము చౌహన్.

**ఎల్ ఐ సిలోకి రాము చౌహన్ ప్రస్థానం**

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లోని మారుమూల ప్రాంతమైన చందంపేట మండలంలో తెల్దేవరపల్లి గ్రామానికి చెందిన సపావాట్ రాము చౌహన్ విద్యాభ్యాసం అంత తన గ్రామంలో ప్రాథమిక విద్యను అభ్యసించి పట్టణమైన దేవరకొండలో జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఆయన 1989 సంవత్సరంలో స్టెనోగ్రాఫర్ గా మచిలీపట్నంలో ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత హైదరాబాదులో జోనల్ ఆఫీసర్ గా 25 సంవత్సరాల పాటు తన సేవలను అందించారు. 2012వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒంగోలు జిల్లాలోని అద్దంకి కి ప్రమోషన్ మీద బ్రాంచ్ మేనేజర్ గా బాధ్యతలు చేపట్టారు. 2013, 14వ సంవత్సరంలో నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని ఎఫ్ కే వై రాయ్ చైర్మన్ తో ఎస్. రాము చౌహన్ ను ఘనంగా సన్మానించారు. అక్కడినుండి బదిలీపై హైదరాబాదులోని చైతన్యపురి ముషీరాబాద్ హిమాయత్ నగర్ బ్రాంచ్ లలో ఆయన సేవలను అందించారు. అంతేకాకుండా వారి సేవలను గుర్తించి ఆన్ ట్రాన్స్ఫర్ మీద ఆంధ్రప్రదేశ్లోని పిఠాపురం బ్రాంచ్ కి బదిలీపై వెళ్లారు. ఆ బ్రాంచ్ ను వ్యాపార పరంగా ఎంతో ఉన్నతమైన స్థాయిలో ఉంచడంతోపాటు ఆల్ ఇండియా లెవెల్లో ఆ బ్రాంచ్ కి 9వ ర్యాంకు సాధించడంలో రాము చౌహన్ పాత్ర చాలా ముఖ్యమైనది. అదే గ్రామంలో సికింద్రాబాద్ డివిజన్ అయిన గిరిజన ప్రాంతమైన దేవరకొండ కు గిరిజన ముద్దుబిడ్డ తన స్వగ్రామంలో సేవలందించేందుకుగాను ప్రమోషన్ పై దేవరకొండ బ్రాంచ్ కి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గా ఎస్.రాము చౌహన్ బాధ్యతలు స్వీకరించారు.

**314 బ్రాంచీలలో ఒకటిగా నిలిచిన దేవరకొండ బ్రాంచ్**

ఇదేక్రమంలో ఎల్ఐసి లో గత కొద్ది నెలల క్రితం ఎల్ఐసి జోనల్ కార్యాలయం వారు నిర్వహించిన వ్యాపార పోటీలలో పాల్గొని విజయం సాధించిన బ్రాంచీలకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం మనాలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఆ ఆ బ్రాంచ్ మేనేజర్లను ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలలో ఉన్న ఎల్ఐసి కార్యాలయాలకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపుగా 314 బ్రాంచీలకు గాను కేవలం 46 బ్రాంచీలు మాత్రమే ఈ వ్యాపార పోటీల్లో అర్హత సాధించడం జరిగింది. అర్హత సాధించిన బ్రాంచీలలో కేవలం 23 బ్రాంచీలకు మాత్రమే భార్యాభర్తలకు సన్మానానికి అర్హత సాధించడం జరిగింది. అర్హత సాధించిన వారిలో దేవరకొండ బ్రాంచ్ ఒకటిగా నిలిచి నిలవడం లో కీలక పాత్ర పోషించిన దేవరకొండ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహన్ కు జోనల్ మేనేజర్లచే సన్మానం సత్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహన్ మాట్లాడుతూ 314 బ్రాంచీలలో దేవరకొండ బ్రాంచ్ ఒకటిగా నిలవడం చాలా ఆనందంగా ఉందని ఈ సన్మానం ఈ అవార్డు దేవరకొండ ఎల్ఐసి కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దేవరకొండ బ్రాంచ్ లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి జరిగిన సన్మానంగా భావిస్తున్నానని ఈ పోటీలలో దేవరకొండ బ్రాంచ్ ఒకటిగా నిలవడం ఈ పోటీలలో విజయం సాధించడానికి సహకరించిన ఏజెంట్ మిత్రులు తమ ఉనికిని చాటుకున్నారని ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఇదే చైతన్యంతో దేవరకొండ బ్రాంచ్ ను మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా దేవరకొండ ఎల్ఐసి ఏజెంట్ మిత్రులందరూ సమైక్యంగా పనిచేసే తమ వ్యాపారాన్ని పెంపొందించుకోవడంతో పాటు దేవరకొండ ఎల్ఐసి బ్రాంచ్ ను ఉన్నత శిఖరాలకు చేరేందుకు కృషి చేయాలని ఆ ఆత్మవిశ్వాసాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించాలని ఆయన తెలిపారు. ఈ పోటీలకు సహకరించిన డెవలప్మెంట్ ఆఫీసర్లకు సి ఎల్ ఐ ఏ మిత్రులకు డైరెక్ట్ ఏజెంట్ మిత్రులకు ఏజెంట్ మిత్రులకు కార్యాలయ సిబ్బందికి ఆయన అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఆలేరు రాష్ట్రంలోనే ఆదర్శం

తుర్కపల్లి, నవంబర్ 23 :



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో తెలంగాణ రాష్ట్రంలో ఆలేరు నియోజకవర్గం ఆదర్శంగా ఉందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇండ్లను మంజూరు చేసినట్లు, అన్ని మండలాల్లో ఇండ్లు 90 శాతం పూర్తయినయని అన్నారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇచ్చి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. మరో విడత నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేసి నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం లేకుండా చూస్తామని అన్నారు. అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జానయ్య, హౌసింగ్ డిఈ శ్రీరాములు, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, తహసిల్దార్ జలజా కుమారి ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పలుగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎలగల రాజయ్య, ఎంపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ డొంకెని వెంకటేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు భూక్య రాజారాం నాయక్, పనిగట్ల సుదర్శన్, బొత్త రాములు, రామ గొని వెంకటేష్ గౌడ్, శ్రీరామ్ మూర్తి, మహిళా శాఖ మండల అధ్యక్షురాలు మమత, అధికారులు, నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సెకండ్ టైమ్ ఓవర్ లోడ్ అయితే...

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 23:

రెండు తెలుగు రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, తెలంగాణ రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. ఓవర్‌లోడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాన్ని సీజ్ చేయాలని.. రెండో సారి నిబంధనలు ఉల్లంఘిస్తే.. అలాంటి వారి లైసెన్సులు,వెహికల్ పర్మిట్లు రద్దు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే అధికారులు.. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తనిఖీలు ముమ్మరం చేసి, వేలాది కేసులు నమోదు చేశారు. ప్రమాదాల నివారణకు విస్తృత ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.ఈమధ్య కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రతి రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వాలు, అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. ఇక తాజాగా చేవెళ్ల దగ్గర చోటు చేసుకున్న ప్రమాదమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలో తెలంగాణ రవాణా శాఖ అధికారులు మరింత కఠిన నియమాలు అమలు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే అమలవుతున్న సంస్కరణలను మరింత కఠినతరం చేయాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి.. మరణాల రేటును తగ్గించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.ప్రమాదాల నివారణకు, సంస్కరణలను కఠినంగా అమలు చేయడం కోసం రవాణా శాఖ అధికారులు ఇప్పటికే 33 జిల్లా స్థాయి బృందాలు, 3 రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో డీటీసీ, ఆర్టీఏ, ఇతర అధికారులు ఉంటారు. వీరు నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. అలానే ముందస్తు సమాచారం లేకుండా.. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి ఆయా బృందాలు తనిఖీలు చేయడానికి వెళ్లిపోతున్నాయి. ఎప్పుడు.. ఎక్కడ తనిఖీ చేస్తారు అనే దాని గురించి ఏమాత్రం బయటకు తెలియనివ్వడం లేదు. పది రోజులుగా ఇలానే రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర తనిఖీలు నిర్వహించి రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారి మీద కేసులు నమోదు చేస్తున్నారు. ఈ పది రోజుల వ్యవధిలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను 4,748 కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో భాగంగా మొత్తం 3,420 వాహనాలు సీజ్ చేశారు. ఈ అంశం మీద తెలంగాణ రవాణ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు మరింత ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఆదేశించారుఓవర్‌లోడ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని.. అందుకే అధికారులు దాని మీద ఎక్కువ దృష్టి పెట్టాలని మంత్రి పొన్నం ఆదేశించారు. ఓవర్‌లోడ్ వాహనాలను సీజ్ చేయాలని.. సదరు వాహనాలు రెండో సారి కూడా ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే.. వాటి పర్మిట్ మాత్రమే కాక.. ఆ వెహికల్ నడుపుతున్న డ్రైవర్.. డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలానే ఓవర్‌లోడ్ అంశంపై మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అంటే ఎక్కడైతే వాహనాల లోడింగ్ జరుగుతుందో.. అక్కడే వాటిల్లో ఓవర్‌లోడ్ నివారించేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు

# పరిశ్రమల్లో పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి

జయభేరి, పరవాడ:



రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించకపోవడమే కాదు, ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయసేకరణను రద్దు చేయాలన్న డిమాండ్ పై ఏకమవడం నూతన పరిణామం. ప్రభుత్వం ఇప్పటికైనా గమనించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గని శెట్టి సత్యనారాయణ అన్నారు.

ఆదివారం అయిన పరవాడలో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పేరుతో మోసగించి కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం పడుతున్న తాపత్రయానికి ప్రజా పోరాటాలు ప్రతిబంధకంగా మారాయని . తమ ఆధీనంలోని పోలీసు బలగాలతో ప్రజలను భయపెట్టాలని చేసిన ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయని ఈ క్రమంలోనే ప్రయివేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన రూపంలో తెలియజేస్తున్నారని అన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను అటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశాయని కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధిపతులకు లాభాలు సమకూర్చడంపైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయని ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయని అన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రమాదకరమైన, అత్యంత ప్రమాదకరమైన జాబితాలో 386 పరిశ్రమలున్నట్లు 2023లో అధికార యంత్రాంగం గుర్తించింది.

గత ఐదేళ్లలో 110 పరిశ్రమలకు నోటీసులు జారీచేశారని అన్నారు. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బతీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడంలేదని ఎన్టీపిసి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలతో పడుతున్నారని అన్నారు.పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీకి ఆనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం కాలుష్య కారకమైన పరిశ్రమలు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గని శెట్టి డిమాండ్ చేశారు.

# ఈ నెల 29న దీక్షా దివాస్ ఘనంగా నిర్వహించాలి

- తెలంగాణ చరిత్రలో గొప్ప ఘట్టానికి గుర్తుగా దీక్షా దివాస్
- నాయకులకు దిశానిర్దేశం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**జయభేరి, హైదరాబాద్ :**

భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 29న దీక్షా దివాస్, ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దశాబ్దంన్నర క్రితం పార్టీ అధినేత కెసిఆర్ తెలంగాణ వచ్చుడో..కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగ నిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు. తెలంగాణ చరిత్రలో ఘనమైన ఈ ఘట్టాన్ని పురస్కరించుకొని దీక్షా దివాస్‌ను పెద్దఎత్తున నిర్వహించాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులు మరియు పార్టీ జనరల్ బాడీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దీక్షా దివాస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శనం చేశారు.

దీక్షా దివాస్ నిర్వహణకు ముందుగా, ఈ నెల 26వ తేదీన అన్ని జిల్లాల పార్టీ కేంద్రాల్లో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సహా ఇతర కీలక నాయకులందరినీ ఆహ్వానించాలని ఆయన ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశాల ముఖ్య ఉద్దేశం, నవంబర్ 29న పార్టీ ఘనంగా నిర్వహించే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. నవంబర్ 29న జరిగే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని అన్ని జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లోనే నిర్వహించాలి. ఈ సందర్భంగా ఒక రోజు ముందుగా, అంటే 28వ తేదీ సాయంత్రంలోగా జిల్లా కేంద్రాలు, పట్టణాలను బ్యానర్లు, ఫ్లెక్సీలతో అలంకరణ పూర్తి చేయాలి. పార్టీ కార్యాలయం ప్రాంగణాన్ని కూడా సుందరంగా అలంకరించాలి. జిల్లాలోని ముఖ్య నాయకులందరికీ ప్రత్యేకంగా సమాచారం అందించి, కనీసం 1000 మంది కీలక పార్టీ నేతలతో ఈ సమావేశాన్ని నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. మొదటగా తెలంగాణ తల్లికి, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన తర్వాత, కార్యక్రమం ప్రారంభానికి గుర్తుగా కెసిఆర్ గారి భారీ కటౌట్‌కు పాలాభిషేకం చేయాలి. దీక్షా దివాస్ సందర్భంగా జరిగిన అనేక కీలక సంఘటనలు, వార్తలు, పరిణామాల సమాహారంతో కూడిన ఫోటో ప్రదర్శనను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఈ ఫోటోలను పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లాకు పంపిస్తుంది. వీటితో పాటు, స్థానిక జిల్లాల్లో దీక్షా దివాస్ సందర్భంగా జరిగిన సంఘటనల ఫోటోలు, వార్తా కవరేజ్ క్లిప్పింగ్‌లతో మరొక ఉప విభాగాన్ని కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. కేవలం రాజకీయ ఉపన్యాసాలు కాకుండా, ఆనాటి ఉద్యమ స్మృతులను, ముఖ్యంగా దీక్షా దివాస్ వివరాలను అందించేలా మాట్లాడే వక్తలను ఆహ్వానించాలని, వారి సమయాన్ని ఇప్పుడే నిర్ధారించుకోవాలని కేటీఆర్ సూచించారు. దీక్షా దివాస్ రోజున పండ్ల పంపిణీ, వీలుంటే అన్నదానం లాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టవచ్చు. హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా పండ్ల పంపిణీ చేయనున్నారు. అలాగే, పార్టీ యూత్ మరియు విద్యార్థి విభాగం తరఫున ప్రతి యూనివర్సిటీలో దీక్షా దివాస్ కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ సందర్భంగా వారు దీక్షా దివాస్ పేరుతో, కెసిఆర్ చిత్రంతో కూడిన ప్రత్యేక టీ షర్టులను ధరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

---



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బంజారా ముద్దుబిడ్డ, నిస్వార్థపరుడు, నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా సేవకులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆదివారం దేవరకొండ పట్టణంలోని కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు TVN రెడ్డి,బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, దండేకర్ ప్రసాద్, రమావత్ రమేష్, కేతావత్ శంకర్,జనీబాబా,పొట్ట మధు, ఆఫ్రోజ్,జమీర్ బాబా, ముదిగొండ హరిదాస్, సుధాకర్, నేనావత్ నాగార్జున్, జంగయ్య,వాడిత్య గణేష్, ప్రశాంత్, విక్కి, తదితరులు పాల్గొన్నారు.

---

## శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి అభిషేకం, అన్న ప్రసాదం కార్యక్రమం

- BRS రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం గిరిజ నగర్ తండాకు చెందిన బిఆర్ఎస్ నాయకులు తన అనుచరుడు నేనావత్ నాగార్జున నాయక్ స్వగృహంలో ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి అభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీల్యా నాయక్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందం మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నీల రవికుమార్,హరి నాయక్, జయప్రకాష్, కిషన్, రాజు నాయక్, మోతిరాం నాయక్, ఉమయ్య, జైపాల్ నాయక్, సీతా, ఆంజనేయ, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

---

## ఎన్సి సి డే సందర్భంగా చెట్లు నాటడం, ప్రతిజ్ఞ చేయడం, ర్యాలీ




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో ఎన్సిసి విభాగం ఆధ్వర్యంలో ఎన్సిసి డే సందర్భంగా కళాశాలలోని ఎన్సిసి క్యాడేట్లు చెట్లు నాటడం, ప్రతిజ్ఞ చేయడం, ర్యాలీ తీయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్సిసి వలన క్రమశిక్షణ అలబడుతుందని సమాజంలో బాధ్యతయుతంగా క్రమశిక్షణతో మెలుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీటిఓ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య ,సిఓఈ జి. లింగారెడ్డి తదితర అధ్యాపకులు ఎన్సిసి క్యాడేట్లు తదితరులు పాల్గొన్నారు.

---

## ఇందిరమ్మ చీరల పంపిణీ

- తీదేడు గ్రామంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన తీదేడు మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు(వెంకటంపేట)గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళ సంఘ సభ్యులకు,మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన తీదేడు మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం గొప్ప ముందడుగు అని తెలిపారు. మహిళ సాధికారతే ప్రజా ప్రభుత్వం దేయమని తెలిపారు.ఇందిరమ్మ చీరలు తెలంగాణ సంస్కృతి చిహ్నమని తెలిపారు. తెలంగాణా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళ శక్తి కార్యక్రమాలు,ఇందిరమ్మ చీరలు,గృహ లక్ష్మి,వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, సంఘ బంద సభ్యులు ,మహిళ సంఘాల సభ్యులు, విబికెలు గంటేల ఇందిరమ్మ, పంబల జ్యోతి, తీదేడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివర్ల శంకర్ యాదవ్, షైక్ బాలేమియా, సందే లక్ష్మయ్య, దాసరి ముత్తయ్య, ఐతమోని వెంకటయ్య, గంటేల చంద్రయ్య, మహిళ సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

---




## ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి

- సైబర్ నేరాల విషయంలో అప్రమత్తత అవసరం
- హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్,

**జయభేరి, హైదరాబాద్ :**

చార్మినార్ ప్రాంగణంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం. ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్లకు పెట్టుబడిగా మారుతోందని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, అన్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరికి అప్రమత్తత అవసరమని ఆయన సూచించారు. హైదరాబాద్ చార్మినార్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 'జాగృత్ హైదరాబాద్‌సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమానికి నగర సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ అధికారులతో కలిసి చార్మినార్ పరిసరాల్లో సైబర్ క్రైం నివారణ కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం చార్మినార్ నుంచి మదీనా వరకు తలపెట్టిన సైబర్ క్రైం అవగాహణ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో సైబర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ను సైబర్ నేరరహితంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి మంగళ, శనివారాల్లో 'జాగృత్ హైదరాబాద్‌సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారంలో ఈ రెండు రోజులు ప్రతి ఇంటికి పోలీస్ అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని ఆయన వివరించారు. అవగాహన లేమితోనే అనేక మంది సైబర్ నేరాల బాధితులవుతున్నారని అన్నారు. ఏ రకమైన సైబర్ మోసం అయినా, వాటికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజలకు స్వీయ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని, స్వచ్ఛందంగా వలంటీర్లుగా ముందుకు వచ్చే వారు సైబర్ సింబాలుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఒక సైబర్ సింబా తయారై తన కుటుంబాన్ని, సమాజాన్ని సైబర్ మోసాల నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ ఫోటోలు, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేయవద్దని, అలా చేస్తే ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలు సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్నారని, ముఖ్యంగా ఆడపిల్లలు అజ్ఞాత వ్యక్తులతో చాటింగ్ చేసి వ్యక్తిగత వివరాలు సమర్పించుకొని బాధితులు అవుతున్నారని చెప్పారు.

ఆడ పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారికి ఫోన్లు ఇచ్చే ముందు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుంటున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాల పట్ల వారి పిల్లలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా హెల్ప్ లైన్ నంబర్ 1930కి చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాగే, జాతీయ సైబర్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ చాలా కీలకమని, మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టవచ్చని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్ లను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు.

ఈ కార్యక్రమములో అడిషినల్ సిపి క్రైం ఆండ్ సిట్ శ్రీ.యం.శ్రీనివాస్ ఐపిఎస్, సౌత్ జోన్ అడిషినల్ డిసిపి శ్రీ.యం. మాజిద్, సౌత్ జోన్ ఏసీపీలు పి.చంద్రశేఖర్, సీహెచ్.చంద్రశేఖర్, జి.శ్యామ్ సుందర్, ఎంఏ జావీద్, తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

---

## బీఆర్ఎస్ ఎందుకు కుప్పకూలింది?

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 23:**



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఎదుర్కొన్న ఓటమి... కేవలం పరాజయం కాదు. గత ఒక దశాబ్దంగా హైదరాబాద్‌లో పర్పుల్ రంగులో మెరుస్తూ వచ్చిన బీఆర్ఎస్‌కు ఇది పెద్ద రాజకీయ హెచ్చరిక. పార్టీ అంచనాలు, క్యాడర్ ఆశలు... ఏదీ నెరవేరలేదు. బీఆర్ఎస్ ఎందుకు గెల్చుకోలేకపోయింది? ఎక్కడ తప్పు జరిగింది? జూబ్లీహిల్స్ ఫలితం బీఆర్ఎస్‌కు పెద్ద జోల్ట్. పార్టీ పాకేజీ కూడా లేకుండా, ప్రణాళిక దూరంగా ఉండగా, కాంగ్రెస్ మాత్రం వ్యూహాత్మకంగా ముందుకు సాగింది. కానీ ఈ ఓటమి ఒక్క కారణంతో రాలేదు. అందులో దాగి ఉన్న ఎన్నో లోతైన రాజకీయ పొరపాట్లు... నాయకత్వానికి అసలు తలనొప్పిగా మారాయి.

ప్రచారం మొత్తంలో కేసీఆర్ ఒక్క సభ కూడా చేయలేదు. క్యాడర్‌కు ఇది పెద్ద మైనస్. హరీష్ రావు దూరంగా ఉండాల్సి రావడం కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. పార్టీ పదేళ్లపాటు అధికారంలో ఉండి ఇంత తేలికగా వ్యవహరించిందన్న విమర్శలు వచ్చాయి.

ప్రచారం సమయంలో ఎక్కడికక్కడ గ్రూపులు, వేర్వేరు నేతలు వేరు వేరు కార్యక్రమాల్లో ... బీఆర్ఎస్ నేతల్లో ప్రచారం సమయంలో కనిపించాల్సిన జోష్ కనిపించలేదు. అంతర్గత అసమ్మతి బాగా బయటపడింది. కొంతమంది నాయకులు కాంగ్రెస్ అభ్యర్థికి సహకరించారని వచ్చిన ఆరోపణలు క్యాడర్‌ను మరింత నిరుత్సాహపరిచాయి. ఇది ఓటర్ల మైండ్‌సెట్‌లో నేరుగా ప్రభావం చూపింది.

జూబ్లీహిల్స్‌లో ముస్లిం ఓటర్లు కీలకం... ఇది తెలియని విషయం ఏం కాదు. అయితే ప్రచారం చూస్తే ఆ వర్గానికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రతినిధులు, గ్రౌండ్ యాక్టివిటీ ఏది కనబడలేదు. ఫలితం... ఆ వర్గం మొత్తం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపింది. ఉపఎన్నికల్లో డోర్‌టుడోర్ ప్రచారం అత్యంత కీలకం. కానీ బీఆర్ఎస్‌కు అనేక ప్రాంతాల్లో బూత్ స్థాయి నాయకులు కనిపించలేదు. ప్రచారం ఈజీగా, నిర్లిప్తంగా సాగింది. కొన్ని కాలనీల్లో ప్రచారం కనిపించలేదన్న వాస్తవం... ఓటర్లను పార్టీ దూరం చేసింది. నియోజకవర్గ అభివృద్ధి గురించి చెప్పాల్సిన సమయంలో... బీఆర్ఎస్ పూర్తిగా హైడ్రా కూల్చివేతల ప్రాపగాండాపైనే నడిచింది. ఇది నేరుగా ప్రజలకు ఎలాంటి సమస్య కలిగించిందన్న అంశం మాత్రం బలంగా కన్విన్స్ చేయలేదు. కేటీఆర్ ప్రసంగాలు కూడా డెవలప్మెంట్ కంటే రేవంత్ రెడ్డి పై అటాక్ మోడ్‌లోనే ఎక్కువగా కనిపించాయి.

గోపీనాథ్ మరణం మిస్టరీలా కాంగ్రెస్ ప్రొజెక్ట్ చేయడంలో విజయవంతమైంది. సునీతపై దాడి చివరి రోజులలో మరింత పెరిగింది. ఈ కాంట్రవర్సీలను కౌంటర్ చేయడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. మహిళా ఓటర్లను ఇది బాగా ప్రభావితం చేసింది.

కేటీఆర్ చివరి రెండు రోజుల వరకూ ప్రచారంలో యాక్టివ్‌గా కనిపించలేదు. ప్రచారం ఉన్నప్పుడు కూడా ఆయనలో కనిపించాల్సిన ఆత్మవిశ్వాసం, ధైర్యం...అవి పాక్షికంగా మాత్రమే కనిపించాయి. పార్టీని ఒంటరిగా మోసిన ఆయనపై ఈ ఓటమి ప్రభావం అత్యధికంగా పడే అవకాశం ఉంది. ఎన్నికల్లో డబ్బు పంపిణీ కీలక పాత్ర పోషిస్తుందని అందరికీ తెలిసిందే.

కానీ జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పంచిందా? పంచలేదా?... ఈ అనుమానం ప్రజల్లో బలంగా వినిపించింది. ఈ గందరగోళం... సానుభూతి ఓటు కూడా కాంగ్రెస్ వైపు వెళ్లేలా చేసింది. మొత్తం మీద – ఇది ఒక్క ఉపఎన్నిక కాదు, బీఆర్ఎస్‌కు రెడ్ అలర్ట్. ఈ చిన్న ఎన్నిక... పెద్ద రాజకీయ సంకేతాలను ఇచ్చింది. పార్టీ బలం ఎక్కడ ఉంది? బలహీనత ఎక్కడ బయల్పడింది? ఏ నాయకులపై ప్రజలు నమ్మకం కోల్పోయారు?

ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించకపోతే... బీఆర్ఎస్‌కు రాబోయే రోజులు మరింత క్లిష్టమయ్యే అవకాశముంది. జూబ్లీహిల్స్ పరాజయం... బీఆర్ఎస్‌కు సైలెంట్‌గా అనిపించినా... రాజకీయంగా పెద్ద ప్రమాద సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీ వ్యూహం, నాయకత్వం, ప్రచార పద్ధతిపై సమగ్ర సమీక్ష అవసరం ఉందనే అభిప్రాయం బలపడుతోంది.

---

## ఇన్నర్ రింగ్ రోడ్డుకు నిధులు మంజూరు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 23:**

తెలంగాణ అభివృద్ధికి కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం పనులు వేగవంతం కానున్నాయి. కేంద్రం అనుమతితో డిసెంబర్‌లో ఉత్తర భాగం కోసం టెండర్లు పిలవనున్నారు. సంగారెడ్డి నుంచి రాయగిరి వరకు 161.5 కి.మీ. ఈ రహదారిని ముందుగా నాలుగు లేన్లు అనుకున్నారు. కానీ ఇప్పుడు 6 లేన్లుగా విస్తరించనున్నారు. దీని అంచనా వ్యయం రూ.15,627 కోట్లకు చేరింది. త్వరలోనే ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయంటున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించనున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) పనులకు సంబంధించి కీలకమైన అప్‌డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ పనులును ఉత్తర, దక్షిణ అంటూ రెండు భాగాలుగా విభజించిన సంగతి తెలిసిందే. వీటిల్లో ముందుగా ఉత్తర భాగం పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల్లో వేగం పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు కేంద్రం నుంచి అనుమతి రావడంతో.. టెండర్లను ఆహ్వానించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఇంజినీర్లు రెడీ అవుతున్నారు. డిసెంబర్, 2025లో ఈ టెండర్లు పిలవనున్నారు.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం.. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ గ్రామం నుంచి యాదాద్రి జిల్లాలో ఉన్న రాయగిరి వరకు ఉంది.

అయితే తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ రహదారి నిర్మాణాన్ని 4 లేన్ల నుంచి ఆరు లేన్లకు మారుస్తూ నిర్ణయం తీసుకోవడమే కాక ఆమోద ముద్ర కూడా వేసింది. దీంతో ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అంచనా వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రకారం.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో నిర్మించబోయే 161.5 కిలో మీటర్ల ఆరు లేన్ల రోడ్డు నిర్మాణం ఖర్చు ఇప్పుడు రూ.15,627 కోట్లకు చేరింది. డిసెంబర్‌లో టెండర్లు ఆహ్వానించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. అయితే గతంలో ఈపీసీ పద్ధతిలో టెండర్లు పిలవగా.. ఇప్పుడు హ్యామ్ మోడల్‌లో పనులు చేయనున్నారు.ఆర్ఆర్ఆర్ మొత్తం పొడవు 343.5 కిలోమీటర్లు. దీని కోసం రూ.36 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అలానే ఈ రహదారి నిర్మాణాన్ని 2 భాగాలుగా విభజించారు. ఉత్తర భాగం 161.5 కిమీ కాగా దక్షిణ భాగం 182 కిలోమీటర్లుగా నిర్ణయించారు. ముందుగా ఉత్తర భాగం పనులు పూర్తి చేయాలని నిర్ణయించడమే కాక.. డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. అయితే ముందుగా 4 లేన్లతో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టాలని భావించారు. ఇందుకు మొత్తం రూ.7,104.06 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయడమే కాక గతేడాది అనగా 2024 డిసెంబర్లోనే టెండర్లు పిలిచారు.అయితే నగరంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్ఆర్ఆర్ రోడ్డును ఆరు లేన్లుగా మార్చుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగింది. పెరిగిన అంచనాల ప్రకారం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి రూ.15,627 ఖర్చు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం 161.5 కిలో మీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారిని.. హ్యామ్ పద్ధతిలో నిర్మించడానికి అధికారులు సిద్ధమయ్యారు. మొత్తం ఆరు ప్యాకేజీల్లో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. టెండర్ దక్కించుకున్న సంస్థ రెండున్నర సంవత్సరాల కాలంలో పనులు పూర్తి చేయాలిన. అలానే 15 సంవత్సరాల పాటు రోడ్డు నిర్వహణ బాధ్యతలు చూసుకోవాలి.



# బుద్ధుడి విగ్రహం.. ఫ్యామిలీ ఫోటో...

ఇటీవల ఓ ఇంటీరియర్ డిజైనర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన రీల్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. హైదరాబాద్ జూబిలీ హిల్స్‌లోని ఓ ఇంట్లోకి తీసుకెళ్తూ, 'ఈ ఇంట్లో ఫ్లవర్స్ అరేంజ్ చేస్తున్నాను' అని క్యాప్షన్ పెట్టి వీడియో షేర్ చేశారు. కానీ ఆ వీడియోలో కనిపించిన గోల్డెన్ బుద్ధా స్టాచ్యూ, న్యూట్రల్ టోన్స్‌తో కూడిన లివింగ్ ఏరియా, గోల్డ్ ఫ్రేమ్డ్ ఫ్యామిలీ ఫోటోలు... ఇవన్నీ చూస్తే ఇది సామాన్య ఇల్లు కాదని తెలుస్తోంది. ఇది ఒక స్టార్ హీరో ఇల్లు! ప్రవేశ ద్వారం నుంచే మనసు ఆకట్టుకునే వైభవం. స్టోన్ టైల్స్ మీద అడుగు పెడితే చల్లని ఫీల్, పక్కనే గ్రీనరీతో నిండిన చిన్న గార్డెన్. గేట్ పక్కన గోల్డ్ లెటరింగ్‌లో ఫ్యామిలీ పేరు... అది కూడా గోల్డ్ షీన్‌తో మెరిసిపోతుంది. లోపలికి అడుగు పెడితే లివింగ్ రూమ్‌లో క్రీమ్‌గ్రే సోఫాలు, చెకర్డ్ సెంటర్ టేబుల్, భారీ గోల్డ్ ఫ్రేమ్డ్ మిర్రర్. గోడ మీద రంగురంగుల పెయింటింగ్స్, క్రిస్టల్ షాండెలియర్ కింద నుంచి వచ్చే సాఫ్ట్ లైట్... ఇవన్నీ కలిసి ఒక రాయల్టీ ఫీల్ ఇస్తాయి, అయినా ఎక్కడా ఓవర్ లగ్జరీ అనిపించదు. సింపుల్, ఎలిగెంట్, కోజీ. అవుట్‌డోర్ సీటింగ్ ఏరియా మరింత ఆహ్లాదకరంగా ఉంది. గ్రే కుషన్స్, కాఫీ టేబుల్, చుట్టూ గ్రాస్... అక్కడ కూర్చుంటే సాయంత్రం కాఫీ తాగుతూ గడపాలనిపిస్తుంది. కానీ ఆ వీడియోలో అందరి దృష్టిని ఆకర్షించింది మరో కార్నర్ మారూన్ వాల్ ముందు గోల్డెన్ బుద్ధా స్టాచ్యూ, పక్కన చిన్న టేబుల్ మీద మరో బుద్ధ ఫిగరిన్. దాని చుట్టూ ఫ్రెష్ వైట్ ఫ్లవర్స్... ఆ ఒక్క కార్నర్ చూస్తేనే మనసుకి ప్రశాంతత వచ్చినట్టు ఉంటుంది. ఈ ఇంటి యజమానులు లగ్జరీతో పాటు ఆధ్యాత్మికతను కూడా ఎంత అందంగా మేళవిస్తున్నారో అర్థమవుతుంది.

# డార్లింగ్ ఫ్యాన్స్ కు పండగే..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. బాహుబలి తర్వాత డార్లింగ్ ఫాలోయింగ్ అమాంతం పెరిగిపోయింది. ఇప్పుడు చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. అందులో రాజా సాబ్ సినిమా ఒకటి. డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే విపరీతమైన హైప్ నెలకొంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, ట్రైలర్ విడుదల కాగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా ట్రైలర్ తో సినిమాపై అంచనాలు పీక్స్ కు చేరింది. ఈ మూవీ ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల చేశారు మేకర్స్. ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రాజాసాబ్ ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ఈ పాటను తమన్ అద్భుతంగా కంపోజ్ చేశాడు. పాట లేటుగా వచ్చిన కూడా డార్లింగ్ ఫ్యాన్స్ ఎంజాయ్ చేసేలా ఉంది. రామజోగయ్య శాస్త్రి ఈ పాటకు అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. ఫుల్ జోష్ మీద సాగే ఈ పాటలో ప్రభాస్ ఎనర్జిటిక్ స్టెప్పులు అదిరిపోయాయి. చాలా కాలం తర్వాత ప్రభాస్ ను ఇలా ఫుడ్ సాంగ్ లో చూడడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇదెలా ఉంటే.. ఆదివారం స్పిరిట్ మూవీ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.



# డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదు..

'సినిమా అనేది ప్రజల సమస్యలను పెంచకూడదు. వినోదాన్ని మాత్రమే పంచాలి.' అంటున్నారు బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి. ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో ఆమె నేటి సినిమాల గురించి ఆసక్తికరంగా మాట్లాడారు. 'స్క్రిప్ట్ ఎంచుకునే విషయంలో నేను కొన్ని విలువలకు కట్టుబడి ఉంటా. సినిమా ప్రజల్లో ద్వేషాన్ని పెంచేలా ఉండకూడదని భావిస్తాను. కథల ఎంపికల విషయంలో డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదు. నా ఎంపికలన్నీ విలువలతో కూడుకున్నవే.' అని తెలిపారామె. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్, మహారాణి, హీరా మండి చిత్రాల్లో ప్రయోగాత్మక పాత్రలతో మెప్పించిన హ్యూమా.. రీసెంట్‌గా రిలీజైన 'ఢిల్లీ క్రైమ్' వెబ్‌సిరీస్ సీజన్ 3లో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం ఆమె నిర్మాతగానూ కొనసాగుతున్నది.



# 50కి పైగా సినిమాలు.. స్పెషల్ సాంగ్స్ లోనూ..

ఈ అమ్మడు. ఇప్పుడు తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ఈ హీరోయిన్ ఎవరో కనిపెట్టారా..? తెలుగమ్మాయే అయినప్పటికీ ముందుగా తమిళ్ సినిమాతో పరిచయం అయ్యింది. ఆ తర్వాత తెలుగులో నటించి మంచి హిట్స్ అందుకుంది. నటన పరంగా మంచి మార్కులు కొట్టేసిన ఈ చిన్నది ఎవరో గుర్తుపట్టారా..? తమిళ్ లో వచ్చిన షాపింగ్ మాల్ సినిమాతో పరిచయం అయ్యింది ఈ భామ. ఈ సినిమా తెలుగులో కూడా డబ్ అయ్యి ఆకట్టుకుంది. ఆతర్వాత జర్నీ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది అంజలి. అలాగే హీరోయిన్ గా పలు సినిమాల్లో నటించింది అంజలి. సూపర్ స్టార్ మహేష్ బాబు, వెంకటేష్ కలిసి నటించిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో అంజలి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తూనే మరోవైపు సెకండ్ హీరోయిన్ గా చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. రీసెంట్ గా గేమ్ ఛేంజర్ సినిమాలో నటించి ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ చిన్నది తన ఫొటోస్ తో ఆకట్టుకుంటుంది.

# కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే 'తూ మేరీ మై తేరా' టీజర్ విడుదల!



బాలీవుడ్ యువ నటీనటులు కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ'. ఈ సినిమాకు సమీర్ విద్వాన్స్ దర్శకత్వం వహిస్తుండగా.. 'సత్యప్రేమ్ కీ కథ' చిత్రం తర్వాత కార్తీక్ - సమీర్ కాంబోలో వస్తున్న రెండో చిత్రమిది. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్‌కి చెందిన ధర్మ ప్రొడక్షన్స్, నమః పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే.. కార్తీక్, అనన్యలు అనుకోకుండా ఒక విదేశీ హాలిడే ట్రిప్‌లో కలుసుకోగా.. గొడవలతో మొదలైన వీరి పరిచయం ప్రేమగా ఎలా మారింది అనేది సినిమా కథ అని తెలుస్తుంది. 'పతి పత్నీ ఔర్ వో' తర్వాత కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే కలిసి నటిస్తున్న రెండవ చిత్రం ఇది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**